
సాక్షి
పల్నాడు
శుక్రవారం । 19 । ఏప్రిల్ । 2024



షార్ట్ ఫిల్మ్ సీడీ ఆవిష్కరణ

తెనాలిఅర్బన్: ఓటు వినియోగంపై అవగాహన కల్పించేందుకు తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్ జైన్ ఆధ్వర్యంలో రూపొందించిన బ్యాలెట్ షార్ట్ ఫిల్మ్ సీడీని బుధవారం రాత్రి ఆవిష్కరించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 508.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 5,496 క్యూసెక్కులు వదిలారు.



శ్రీరాముడి పట్టాభిషేకం

నాదెండ్ల: శ్రీరామనవమి వేడుకలను పురస్కరించుకుని గణపవరంలో గురువారం శ్రీరాముని పట్టాభిషేకం కనుల పండుగలా నిర్వహించారు.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో వ్యయ విభాగాల పరిశీలన



నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా నరసరావుపేట పార్లమెంటు నియోజకవర్గానికి వ్యయ పరిశీలకులుగా నియమించబడిన సుమీత్ కుమార్, అసెంబ్లీ నియోజకవర్గాలకు నియమించబడిన గౌతమన్ గురువారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి ఎల్.శివశంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల వ్యయ పరిశీలకుల విభాగం, కమాండ్ కంట్రోల్ సెంటర్, మీడియా సెంటర్‌ను తనిఖీ చేశారు. పలు రికార్డుల్ని పరిశీలించారు. అనంతరం కమాండ్ కంట్రోల్ రూం సిబ్బందికి, వ్యయ పరిశీలక విభాగ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందజేశారు.

యార్డులో 88,176 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 88,176 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 83,908 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.8,000 నుంచి రూ. 17,500 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.8,000 నుంచి 19,300 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 68,946 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఇన్‌చార్జి కార్యదర్శి కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు.

హనుమజ్జయంతి ఏర్పాట్లకు శ్రీకారం



హనుమాన్‌జంక్షన్‌రూరల్: కృష్ణా జిల్లా హనుమాన్ జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ఏటా వైభవంగా నిర్వహించే హనుమజ్జయంతి ఉత్సవాల ఏర్పాట్లకు గురువారం శ్రీకారం చుట్టారు. ఉత్సవాల ఏర్పాట్లను దేవస్థానం ప్రాంగణంలో రాటా ఉత్సవంతో ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మారేపల్లి సీతారామానుజాచార్యులు, అర్చకుడు శృంగారం వెంకట శేషారామానుజాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవ పందిరి ఏర్పాటుకు రాటా కర్ర ను ప్రతిష్ఠించారు. హనుమజ్జయంతి ఉత్సవాలను మే 27వ తేదీ నుంచి జూన్ 1వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కూచిపూడి శ్రీనివాస్ తెలిపారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పాక కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి మాజీ చైర్మన్లు నెరుసు భూషణం, కొండేటి కనకదుర్గారావు, పుర ప్రముఖులు సుంకర సుభాష్‌చంద్రబోస్, నందూరు సత్య వెంకటేశ్వర శర్మ, మేడేపూ డి రామ్మోహనరావు, తాడి రంగారావు పాల్గొ న్నారు.

నిత్యాన్నదానానికి రూ.10 లక్షల విరాళం



మోపిదేవి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న కృష్ణాజిల్లా మోపిదేవిలోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దేవస్థానంలో నిర్వహించే నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన కేతినేని రత్నాకరరావు, లక్ష్మీ శమంతకమణి దంపతులు రూ.10 లక్షలు విరాళంగా సమర్పించారు. గురువారం ఉదయం స్వామివార్లను దర్శించుకున్న అనంతరం శాశ్వత నిత్యాన్నదాన పథకం కింద ఈ విరాళాన్ని ఆలయ ఏసీ ఎస్ఎస్ చక్రధరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదాలు అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. దాత కుటుంబ సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.4,500, గరిష్ట ధర రూ.6,400, మోడల్ ధర రూ.5,500 వరకు పలికింది.

కూటమిలో మిత్రభేదం

టీడీపీ నేతల ప్రచారానికి జనసేన, బీజేపీ నేతలు దూరం

- ఆ రెండు పార్టీలకు పల్నాడులో ఒక్క సీటు కేటాయించని టీడీపీ
- జనసేన పార్టీకి సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బొర్రా రాజీనామా
- నరసరావుపేటలో జనసేన పార్టీ కార్యాలయం మూసివేత
- భాష్యం ప్రవీణ్‌కి సహకరించబోమని తేల్చిచెప్పిన పెదకూరపాడు బీజేపీ, జనసేన నేతలు
- రెండుగా విడిపోయిన వినుకొండ జనసేన నేతలు
- కూటమి పార్టీ నేతల తీరుతో తలలుపట్టుకుంటున్న టీడీపీ నేతలు

సాక్షి, నరసరావుపేట : పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీకి మిత్రపక్షాలైన బీజేపీ, జనసేన నాయకులు సహకరించడం లేదు. దీంతో టీడీపీ నేతలు తలలు పట్టుకుంటున్నారు. చేసేది లేక ఆ పార్టీ అభ్యర్థులు బుజ్జగింపుల పర్వాలకు తెరలేపారు. పల్నాడు జిల్లాలో ఒక పార్లమెంట్, ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండగా అన్నిచోట్ల తెలుగుదేశం పార్టీ అభ్యర్థులే పోటీలో నిలుస్తున్నారు. దీంతో జనసేన, బీజేపీ నేతలు అసంతృప్తిలో ఉన్నారు. జిల్లాలో కనీసం ఒక్క సీటు అయినా కేటాయించకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. టీడీపీ నేతలను గెలిపిస్తే మా భవిష్యత్ గ్యారెంటీ ఏంటని కొంతమంది ప్రశ్నిస్తుండగా, ఓడిపోయే అభ్యర్థుల కోసం తాము పోరాడాల్సిన అవసరం ఏంటని మరికొందరు భావిస్తున్నారు. దీంతో కూటమి ప్రచారాలలో టీడీపీ క్యాడరే మాత్రమే కనిపిస్తోంది. పొత్తు ధర్మంలో భాగంగా దేశం నేతలు మూడు పార్టీల కండువాలు మెడలో వేసుకోవడంతోపాటు కార్యకర్తల చేత మూడు పార్టీల జెండాలు మోయిస్తున్నారు. పక్క పార్టీల జెండాలు మోసే దుస్థితి పట్ల తెలుగు తమ్ముళ్లు అసహనంలో ఉన్నారు. ఆ పార్టీలతో పొత్తు వల్ల టీడీపీకి ఉపయోగం కన్నా నష్టమే ఎక్కువని వాపోతున్నారు.



నరసరావుపేట జనసేన కార్యాలయం వద్ద ఫ్లెక్సీలు తొలగించిన దృశ్యం

అసంతృప్తిలో జనసేన నాయకులు

జనసేన పార్టీ నరసరావుపేట ఇన్‌చార్జి సయ్యద్ జిలానీ తనకు పొత్తులో భాగంగా పేటలో పోటీ చేసే అవకాశం వస్తుందని బాగా ప్రచారం చేసుకున్నారు. నియోజకవర్గంలో ముఖ్య నాయకుల ఇళ్లకు వెళ్లి సహకరించమని కోరారు. తీరా సీటు టీడీపీ నేత చదలవాడ అరవింద్‌బాబుకు కేటాయించడంతో జిలానీ కొన్ని రోజులు ఎవరికి అందుబాటులో లేకుండాపోయారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న జనసేన కార్యాలయం ఫ్లెక్సీలను తొలగించి తాత్కాలికంగా మూసేశారు. తరువాత ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయులు రహస్యమంతనాలు జరపడంతో మొక్కుబడిగా ప్రచారాలకు హాజరవుతున్నారు. మరోవైపు సత్తెనపల్లి నుంచి పోటీ చేయాలని చూసిన జనసేన నేత బొర్రా వెంకటఅప్పారావు శుక్రవారం పార్టీకి రాజీనామాకు చేశారు. టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణను ఓడించి తీరుతానని తన అనుచరులతో వ్యాఖ్యానించారట.

ప్రాధాన్యత ఇవ్వడంలేదు..

పెదకూరపాడు కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌కు సహకరించేది లేదని రెండు వారాల క్రితమే జనసేన, బీజేపీ నేతలు తేల్చి చెప్పారు. పొత్తులో తగిన ప్రాధాన్యత ఇవ్వకుండా అవమానిస్తున్నారని వాపోతున్నారు. మరోవైపు గురజాలలో యరపతినేనికి టికెట్ ఇవ్వడం పట్ల ఆగ్రహంతో జనసేన ముఖ్యనేతలు ఇటీవల వైఎస్సార్‌సీపీలోకి వెళ్లారు.



జనసేన పార్టీకి రాజీనామా చేసిన లేఖను విడుదల చేసిన బొర్రా వెంకటఅప్పారావు

వినుకొండలో నిలువునా చీలిన జనసేన

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా రెండు జనసేన కార్యాలయాలు వినుకొండలో నడుస్తున్నాయి. పార్టీ ఆవిర్భావం నుంచి నిశ్శంకరావు శ్రీనివాసరావు పార్టీలో క్రియాశీలక నాయకుడిగా ఎదుగుతున్న నేపథ్యంలో మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అతనికి పోటీగా కొణిజేటి నాగశ్రీనుని తెరమీదకు తీసుకొచ్చారనేది ఆ పార్టీ నాయకుల్లో నడుస్తున్న చర్చ. జనసేన రెండు పార్టీలుగా విడిపోవడానికే మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుదే కారణమని కాపు నాయకులే బహిరంగంగా చర్చించుకుంటున్నారు. దీంతో జనసేన, టీడీపీ పొత్తులో భాగంగా టీడీపీకి ఎంతవరకు సహకరిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

మాచర్ల, చిలకలూరిపేట నియోజకవర్గాలలోనూ నెలకొంది. క్షేత్రస్థాయి కార్యకర్తల అభీష్టానికి వ్యతిరేకంగా టీడీపీతో పొత్తుపెట్టుకోవడం, ఒక్కసీటు కూడా కేటాయించకపోవడం పట్ల బీజేపీ నేతలు తీవ్ర అసహనంలో ఉన్నారు. కూటమి ప్రచారాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో టీడీపీ నేతలు పొత్తు వల్ల ఒరిగిందేమి లేదని వాపోతున్నారు.



ప్రజలకు అభివాదం చేస్తున్న నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్, అసెంబ్లీ అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి

వెన్ను తట్టాల్సిన వ్యక్తే ఓటమి కోరుకుంటున్నారు

- పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్
- అసెంబ్లీ అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డితో కలసి ప్రచారం

పిడుగురాళ్లరూరల్: నాకు తోడుగా, అండగా నన్ను చెయ్యి పట్టుకొని నడిపించాల్సిన జంగా కృష్ణమూర్తి అన్న నాకు వ్యతిరేకంగా నన్ను ఓడించాలని టీడీపీలో చేరటం చాలా బాధాకరంగా ఉందని నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. మండలంలోని చెన్నాయిపాలెం, పెద్ద అగ్రహారం, చిన్న అగ్రహారం, పందిటివారిపాలెం, గుత్తికొండ గ్రామాల్లో ఆయన అసెంబ్లీ అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డితో కలసి ఎన్నిక ప్రచారం నిర్వహించారు. ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, అసెంబ్లీ అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డిలకు మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. జై కాసు, జై అనిల్, జై జగన్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. అనిల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అనిల్‌కుమార్‌యాదవ్‌ను ఎంపీగా గెలిపించి చరిత్ర రాయాల్సిన జంగా కృష్ణమూర్తి అన్న బీసీలకు టికెట్ ఇస్తే నేను ఒప్పుకోను అని పార్టీ మారిన వ్యక్తి వెంట నిలబడి అనిల్‌కుమార్‌ను ఓడించాలి ప్రచారం చేయటం చాలా బాధాకరణమన్నారు. పైన దేవుడు ఉన్నాడని, పల్నాడు ప్రజల ఆశీస్సులు, జగన్‌మోహన్‌రెడ్డి అండదండలు ఉన్నాయని అన్నారు. జగనన్న చెప్పినట్లు ఈ ఐదు సంవత్సరాల్లో మీ కుటుంబాలకు మంచి జరిగితే మాకు తోడుగా ఉండాలన్నారు. కాసు మహేష్‌రెడ్డి మాట్లాడుతూ గురజాల నియోజకవర్గంలో ఏ పల్లెను ఎవరు అభివృద్ధి చేశారో చర్చకు రమ్మంటే లోకేష్ బాబు, యరపతినేని శ్రీనివాసరావు తప్పుకున్నారన్నారు. రాయపాటి సాంబశివరావు, లావు శ్రీకృష్ణదేవరాయులు మెడికల్ కాలేజీ మంజూరు చేయించి తీసుకొని వచ్చారని అంటున్నారని మీకు 24 గంటల టైమ్ ఇచ్చాను, ఐదు రోజులు అవుతున్నా దీనిపై స్పందించలేదన్నారు. చెన్నాయపాలెం గ్రామాన్ని రూ.కోటితో అభివృద్ధి చేశామని, మంచినీటి కోసం రూ.1.19 కోట్లు నిధులు తీసుకొని వచ్చామని, టెండర్లు కూడా పూర్తి అయిందని, ఆరు నెలల్లో పనులను పూర్తిచేస్తామన్నారు. చెన్నాయిపాలెం బీసీ గ్రామమని, తెలుగుదేశం పార్టీ నాయకులను అడుగుతున్నానని ఇంత వరకు బీసీలకు ఎందుకు టికెట్ ఇవ్వలేదని చంద్రబాబు చొక్కా పట్టుకొని అడగాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణకు పకడ్బందీ ఏర్పాట్లు

జిల్లా ఎన్నికల అధికారి ఎల్.శివశంకర్

నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ మేరకు జిల్లాలో ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు నామినేషన్లు స్వీకరించేందుకు ఏర్పాట్లు పూర్తిచేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈనెల 18 నుంచి 25వ తేదీవరకు ప్రభుత్వ సెలవులు మినహాయించి మిగతా రోజుల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటలవరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. అభ్యర్థులు అందరూ దీనిని గమనించాలన్నారు. నామినేషన్ల కేంద్రాల వద్ద జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌తో కలసి ఏర్పాట్లు చేశామన్నారు. ఫారం-ఏ ద్వారా పార్లమెంటు, ఫారం-బి ద్వారా అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయాలన్నారు. ఫారం-26 ప్రకారం అఫిడవిట్ అందజేయాలని, లోక్‌సభకు రూ.25వేలు, అసెంబ్లీకి రూ.10వేలు సెక్యూరిటీ డిపాజిట్ అందజేయాలన్నారు. 26వ తేదీన స్క్రూటినీ, 29వ తేదీలోపు ఉపసంహరణ జరుగుతుందన్నారు. నామినేషన్ వేసిన వ్యక్తులకు చెక్‌లిస్టు అందజేస్తున్నామన్నారు. ఈనెల 27న శనివారం నెగోషియబుల్ ఇన్‌స్ట్రుమెంట్ చట్టం ప్రకారం సెలవు దినం, 28న ఆదివారం సెలవు దినాలని పేర్కొన్నారు. కేవలం 29వ తేదీనే ఉపసంహరణ చేసుకోవచ్చన్నారు. ఏర్పాటుచేసిన చెక్‌పోస్టుల ద్వారా రూ.1.75కోట్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. ఎస్పీ జి.బిందు మాధవ్ మాట్లాడుతూ నామినేషన్ల కేంద్రాల వద్ద డీఎస్పీ ర్యాంకు ఆపై వ్యక్తుల పర్యవేక్షణలో బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఉచితంగా మద్యం, ఇతర వస్తువుల పంపిణీపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. సమావేశంలో డీఆర్వో కె.వినాయకం పాల్గొన్నారు.



అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వెళ్లే స్టేషన్ రోడ్డులో ఏర్పాటుచేసిన బారికేడ్లు

జిల్లాలో మొదటి రోజు 12 నామినేషన్లు

ఒకటి పార్లమెంటు, 11 అసెంబ్లీ



నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికలకు జిల్లా వ్యాప్తంగా పార్లమెంటు, అసెంబ్లీ స్థానాలకు మొదటిరోజు 12 మంది నామినేషన్లు దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారులు గురువారం సాయంత్రం పేర్కొన్నారు. నరసరావుపేట పార్లమెంటుకు లావు శ్రీకృష్ణదేవరాయులు(టీడీపీ) ఒకరే నామినేషన్ వేయగా, మిగతా 11మంది అసెంబ్లీ అభ్యర్థులుగా వివిధ నియోజకవర్గాలకు నామినేషన్లు వేశారు. డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి (నరసరావుపేట, మాచర్ల-టీడీపీ), డాక్టర్ గోదా రమేష్‌కుమార్, గోదా వెంకటరమణ (నరసరావుపేట, సత్తెనపల్లి-జాతీయ జనసేన), రావు సుబ్రమణ్యం (చిలకలూరిపేట-నవతరం పార్టీ), గద్దం రమణ, జంగా మల్లికార్జునరావు, రంగిశెట్టి నాగేశ్వరరావు, యర్రబోతు ప్రసాదరావు (వినుకొండ, పెదకూరపాడు, సత్తెనపల్లి, గురజాల-పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా), గౌడుకట్ల అంకమ్మరావు, కంకమ్ శ్రీనివాసరావు (పెదకూరపాడు, గురజాల-ఇండిపెండెంట్) నామినేషన్ దాఖలు చేశారు.

ఈ ఎన్నికలు నా పనితీరుకు రెఫరెండం

- గత మెజారిటీకి ఒక్క ఓటు తగ్గినా .. నాది నైతిక పరాజయమే
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన తర్వాత ఆత్మవిశ్వాసం పెరిగింది
- పార్టీలు మారిన వారికి, పార్టీని నమ్ముకున్న వారికి మధ్య పోరు ఇది
- వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి అసెంబ్లీ అభ్యర్థి అంబటి రాంబాబు



మాట్లాడుతున్న అంబటి రాంబాబు

సత్తెనపల్లి: నియోజకవర్గంలో 2019లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేసి 20,876 ఓట్ల మెజారిటీతో గెలుపొందాను. ఈసారి ఈ మెజార్టీ కన్నా ఒక్క ఓటు తగ్గినా నాది నైతిక పరాజయంగానే భావిస్తానని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి అసెంబ్లీ అభ్యర్థి అంబటి రాంబాబు అన్నారు. ఈనెల 24వ తేదీన వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థిగా మూడోసారి నామినేషన్ దాఖలు చేయనున్న నేపథ్యంలో గురువారం మెగా బైక్ ర్యాలీ నిర్వహించారు. సత్తెనపల్లి పట్టణం నుంచి ప్రారంభమైన ర్యాలీ సత్తెనపల్లి రూరల్, రాజుపాలెం, నకరికల్లు, ముప్పాళ్ల మండలాల మీదుగా సత్తెనపల్లి పట్టణానికి చేరుకుంది. అనంతరం వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాంబాబు మాట్లాడుతూ ఈ నెలలో నియోజకవర్గంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం రోడ్ షో నిర్వహించిన తర్వాత మా కాన్ఫిడెన్స్ లెవెల్ పెరిగిందన్నారు. ఆ రోజు జన సునామీ కనిపించిందన్నారు. ఆ విశ్వాసంతోనే ఈనెల 24వ తేదీన నిర్వహించనున్న నామినేషన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయమని నాయకులకు పిలుపునిచ్చేందుకు నియోజకవర్గస్థాయిలో మెగా బైక్ ర్యాలీ నిర్వహించామన్నారు. దీనికి నేను ఊహించని రీతిలో విశేష జన స్పందన లభించిందన్నారు. స్వచ్ఛందంగా కార్యకర్తలు వారి ద్విచక్ర వాహనాలతో మమ్మల్ని వెన్నంటి అండగా నిలబడటం స్ఫూర్తిదాయకమన్నారు. నియోజకవర్గంలో అధికారం కోసం, అవసరాల కోసం పార్టీలు మారిన వారికి ...పార్టీని నమ్ముకున్న వారికి మధ్య జరుగుతున్న బ్యాలెట్ పోరు ఇది అన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గంలో నాపైన, నరసరావుపేట పార్లమెంటులో డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్‌పైన పోటీ చేస్తున్న వారు ఎవరో మీకు తెలుసన్నారు. విశ్వాసపాత్రులను గెలిపించి విశ్వాస ఘాతకులను ఓడించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఒక ఛానల్ ఇంటర్వ్యూలో నేను మాట్లాడిన మాటలను ప్రతిపక్ష నాయకులు వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికలకు ఈ ఐదేళ్లలో నియోజవర్గంలో నా పనితీరుకు రెఫరెండంగా భావిస్తున్నానని స్పష్టం చేశారు. మెగా బైక్ ర్యాలీని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతా హాసంతి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చిట్టా విజయభాస్కర్‌రెడ్డి, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.


ముగిసిన వసంత నవరాత్రోత్సవాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో నిర్వహిస్తున్న వసంత నవరాత్రోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతి నిత్యం అమ్మవారికి పుష్పార్చన నిర్వహించారు. చివరి రోజు అమ్మవారికి అన్ని రకాల పుష్పాలతో అర్చన చేశారు. దేవస్థాన యాగశాలలో మహా పూర్ణాహుతితో ఉత్సవాలు లాంఛనంగా ముగిసాయి. అమ్మవారికి అర్చన నిర్వహించే పుష్పాలతో ఆలయ ఈవో కెఎస్.రామరావు దంపతులు, స్థానాచార్య శివప్రసాద్ శర్మ, ఏఈవో రమేష్‌బాబు, ఇతర అధికారులు ఊరేగింపుగా వేదిక వద్దకు చేరుకున్నారు. పుష్పార్చన వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చారు. భక్తులకు పుష్పాలను పంపిణీ చేశారు. యాగశాలలో ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ, వైదిక కమిటీ సభ్యులు యజ్ఞనారాయణ మూర్తి, రంగావఝ్జల శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో పూర్ణాహుతి నిర్వహించారు.



రాముడు రాజైన వేళ

- ఇనకుల తిలకుడి రథోత్సవం
- వేలాదిగా హాజరైన భక్తజనంతో పోటెత్తిన యనమదల
- రథం లాగేందుకు పోటీబడ్డ యువత
- వేడుకగా శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవం



పోటెత్తిన భక్తజన సందోహం నడుమ కనుల పండువగా జరుగుతున్న రథోత్సవం

యనమదల (ప్రత్తిపాడు): నింగీ, నేల మురిసేలా అత్యంత వైభవోపేతంగా జరిగిన అయోధ్యాధీపుని రథోత్సవంతో పల్లె పులకించిపోయింది. వేద పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల పూజల, జయజయధ్వానాల మధ్య గ్రామస్తులు, భక్తులు చేయి చేయి కలిపి జై శ్రీరామ్.. జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్ అంటూ సీతారాములు కొలువుదీరిన రథంను ముందుకు లాగారు. 201వ బ్రహ్మోత్సవాలలో భాగంగా గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం యనమదల శ్రీ సీతారామస్వామి దేవాలయంలో గురువారం 131వ దివ్య రథోత్సవం జరిగింది. స్వామి వారిని రాజోచిత అలంకారంతో భారీ రథంపై ఊరేగించారు. రెండవ భద్రాద్రిగా ప్రసిద్ధి గాంచిన సీతారామస్వామి రథోత్సవ వైభవాన్ని వీక్షించేందుకు చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి భక్తులతోపాటు మహిళలు కూడా అత్యధిక సంఖ్యలో తరలి రావడంతో యనయదల భక్త జనసంద్రమైంది. యువత రథం లాగేందుకు పోటీపడ్డారు. ఉత్సాహంగా రథాన్ని ముందుకు లాగారు.

జగదానందకరం.. జగదభిరాముని పట్టాభిషేకం

తొలుత ఉదయం పూజా కార్యక్రమాల అనంతరం నిత్య ఔపాసన, బలిహరణ జరిగాయి. మధ్యాహ్నం సమయంలో యనమదల సీతారామస్వామి దేవాలయంలో శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాన్ని అంగరంగవైభవంగా నిర్వహించారు. చలువ పందిరి కింద కల్యాణ మండపంలో శాస్త్రోక్తంగా జరిగిన జగదభిరాముడు, నీలమేఘశ్యాముని పట్టాభిషేక వేడుకను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. ఆలయ అర్చకులు, ట్రస్టీలు, గ్రామస్తులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని చూసేందుకు భక్తులు ఆసక్తి చూపారు.



పట్టాభిషిక్తుడైన రాములవారు

తిరునాళ్ల సందడి

సీతారాముల కల్యాణ మహోత్సవం తదుపరి రోజున యనమదలలో జరిగిన తిరునాళ్లకు భక్తుల నుంచి విశేష స్పందన వచ్చింది. చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు తిరునాళ్లకు విచ్చేశారు. తిరునాళ్ల ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

క్లుప్తంగా

బీ-ఫాం ఏదీ నాయకా?

- తొందరపడి ముందే కదిలిన అభ్యర్థి
- ఆర్వో ఆఫీసుకు వచ్చి తిరుగు పయనం
- కాంగ్రెస్ అభ్యర్థి కంగారుపై కార్యకర్తలు గుర్రు



పెదకూరపాడు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వింతలు, విశేషాలు చోటు చేసుకోవడం సహజమే. అదే కోవలో నియోజకవర్గంలో ఓ వింత గురువారం చోటు చేసుకుంది. పెదకూరపాడు నియోజకవర్గ అభ్యర్థిగా బలుసుపాడుకి చెందిన పమిడి నాగేశ్వరరావును కాంగ్రెస్ పార్టీ నియమించింది. ఈ క్రమంలో గురువారం నామినేషన్ల పర్వానికి తెరలేవడంతో రాత్రి నుంచి పెద్దఎత్తున తన బంధువులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఇండియా కూటమిలోని మిత్రపక్షాలతో కలసి 30 వాహనాల్లో సుమారు 300 మందితో నామినేషన్ వేసేందుకు పెదకూరపాడు వచ్చారు. అయితే ఇన్ని వాహనాలకు అనుమతి లేదని అధికారులు పెదకూరపాడులోని అంబేడ్కర్ బొమ్మ వద్దనే వాహనాలు నిలిపివేశారు. ఆగ్రహించిన అభ్యర్థి నాగేశ్వరరావు అధికారులతో కొద్దిసేపు వాగ్వాదానికి దిగారు. చివరికి అనుమతి తీసుకున్న ఐదు వాహనాల్లో తన అనుచరులు, అభిమానులతో ర్యాలీగా ఆర్వో కార్యాలయానికి వచ్చారు. నామ పత్రాలు దాఖలు చేసే సమయంలో పార్టీ ఇచ్చే బీ-ఫాం ఏదీ అని ఆర్వో ప్రశ్నించగా దాన్ని తీసుకోలేదని, తరువాత ఇస్తానని బదులిచ్చారు. బీ-ఫాం ఉంటేనే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గుర్తిస్తామని ఆర్వో స్పష్టం చేయడంతో చేసేది లేక తన అనుచరులతో వెనుదిరిగారు. ఇదేంది నాయక తొందరపడి ముందే కదిలావు అంటూ కార్యకర్తలు కొద్దిసేపు నవ్వుకున్నారు.

300 క్వింటాళ్ల బియ్యం పట్టివేత



సత్తెనపల్లి: మండల పరిధిలోని నందిగామ అడ్డరోడ్డు వద్ద 300 క్వింటాళ్ల బియ్యాన్ని సత్తెనపల్లి రూరల్ సీఐ ఎం.రాజేష్ కుమార్ నేతృత్వంలో పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. బాపట్ల నుంచి గుజరాత్‌కు ఈ బియ్యాన్ని తరలిస్తున్నారు. అయితే బియ్యం నలుపు రంగులో ఉండడంతో ఇవి రేషన్ బియ్యమా? కాదా? అనేది తేలాల్సి ఉంది. ఒక్కో బ్యాగులో 30 కేజీలు చొప్పున వెయ్యి బ్యాగులు లారీలో ఉన్నాయని దీనిపై పౌర సరఫరాల శాఖ అధికారులకు లేఖ రాసినట్లు సీఐ రాజేష్ కుమార్ తెలిపారు. బియ్యం విషయమై డిప్యూటీ తహసీల్దార్ అరుణను సంప్రదించగా బియ్యాన్ని శాంపిల్స్ తీసి నిర్ధారణ నిమిత్తం ల్యాబ్‌కు పంపామన్నారు.

ఎన్నికల్లో పీఆర్కేను దీవించండి

పీఆర్కే మాతృమూర్తి రాములమ్మ



రాజానగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పీఆర్కే మాతృమూర్తి రాములమ్మ, సోదరి నాగమణి

దుర్గి : ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవే పరమావధిగా పనిచేస్తున్న కుమారుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి రానున్న ఎన్నికల్లో మద్దతు తెలిపి ఆశీర్వదించాలని పీఆర్కే మాతృమూర్తి రాములమ్మ కోరారు. గురువారం మండలంలోని రాజానగర్, గజాపురం, నిదానంపాడు, ఓబులేశునిపల్లె గ్రామాలలో ఆమె కుమార్తె జవ్వాజి నాగమణితో కలిసి ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులందుకుని ఆయా గ్రామాల్లో గడపగడపకు వెళ్లి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజలను తన కుటుంబంలా భావించి ప్రజా సమస్యల పట్ల అనునిత్యం పరిష్కార దిశగా పనిచేస్తూ ప్రజల హృదయాల్లో కొలువై ఉన్న కుమారుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వారి వెంట పార్టీ మండల కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయ్, వైస్ ఎంపీపీ చల్లా శ్రీనివాసరావు, రెంటచింతల ఎంపీపీ సంపూర్ణమ్మ, సర్పంచ్‌లు నలబోతు చిన్నబ్బాయి, మమ్ము శివ రామకృష్ణ, నాలి రామయ్య, షేక్ హుస్సేన్, గుండాల వెంకట్రామయ్య, జక్కా రమేష్, శ్రీహరిరెడ్డి, కోమటి నాయక్, రాయల మధు, నాగెండ్ల లక్ష్మీనారాయణ, చిల్లంచర్ల కృష్ణ, పలువురు మహిళా నాయకురాళ్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నేడు కారెంపూడిలో..

కారెంపూడి: మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) అమ్మ పిన్నెల్లి రాములమ్మ, పీఆర్కే చెల్లి జవ్వాజి నాగమణి కారెంపూడిలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి ఎన్నికల ప్రచార జరుగుతుందని పేర్కొన్నారు. పార్టీ కేడర్, నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారంలో పాల్గొనవల్సిందిగా వెంకటరామిరెడ్డి విజ్ఞప్తి చేశారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు ముదిరాజులు కృషి చేయాలి

ఆంధ్రప్రదేశ్ ముదిరాజుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణ ముదిరాజ్



మాట్లాడుతున్న నారాయణ ముదిరాజ్

పిడుగురాళ్ల రూరల్ : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ గెలుపుకు ముదిరాజులు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ ముదిరాజుల కార్పొరేషన్ చైర్మన్ నారాయణ ముదిరాజ్ అన్నారు. మండలంలోని కామేపల్లి గ్రామంలో గురువారం ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీలను గుర్తించి వారికి సముచిత స్థానం కల్పించింది ఏకైక వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ముదిరాజులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. ఆర్థికంగా, రాజకీయంగా అభివృద్ధికి సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. ముదిరాజుల సామాజిక వర్గానికి ప్రాధాన్యత కల్పించి విడుదల రజినికి మంత్రి పదవి ఇవ్వడంతోపాటు, బీసీ మెంబర్‌గా పదవి ఇచ్చారన్నారు. గురజాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ముదిరాజుల సోదరులు పాల్గొన్నారు.

జనసేనకు 'బొర్రా' గుడ్‌బై



సత్తెనపల్లి: జనసేన పార్టీ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ పదవికి, క్రియాశీలక సభ్యత్వానికి సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల గ్రామానికి చెందిన బొర్రా వెంకట అప్పారావు గురువారం రాజీనామా చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడినప్పటికీ కూటమి నుంచి సరైన సహకారం లేకపోవడం, పార్టీలోని కొంతమంది ఏకపక్షంగా వ్యవహరిస్తూ కూటమిలోకి వెళ్లడం వంటి సంఘటనలు నేపథ్యంలో ఇమడలేక పార్టీకి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.

గ్రామాలు సమస్యాత్మకం కాకూడదు

- ఎస్పీ బిందు మాధవ్
- వేర్వేరు గ్రామాల్లో గ్రామస్తులతో భేటీ
- ఎన్నికల ఏర్పాట్ల పరిశీలన



సాతులూరులో నాయకులతో మాట్లాడుతున్న ఎస్పీ బిందు మాధవ్

నాదెండ్ల: మండలంలోని పలు సమస్యాత్మక గ్రామాల్లో ఎస్పీ బిందు మాధవ్ పర్యటించారు. రానున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కోరారు. అమీన్‌సాహెబ్‌పాలెం, సాతులూరు, కనపర్రు, చందవరం, గొరిజవోలు గ్రామాల్లో స్పెషల్ బ్రాంచి సీఐ ప్రభాకర్, రూరల్ సీఐ శ్రీనివాస రెడ్డి, సిబ్బందితో కలిసి పోలింగ్ బూత్‌లు పరిశీలించారు. అమీన్ సాహెబ్‌పాలెం గ్రామంలో 2014లో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన ఇరువురు మృతి చెందిన సంఘటన విదితమే. గతంలో సాతులూరు గ్రామంలో ఓ పోలింగ్ బూత్‌లో బాంబులు వేసిన ఘటనలు ఉన్నాయి. కనపర్రు గ్రామంలో బ్యాలెట్ పత్రాలు గల్లంతు, అదే గ్రామంలో నకిలీ పీవో, ఏపీవోలు పట్టుబడిన సంఘటనలున్నాయి. గొరిజవోలు, చందవరం గ్రామాల్లో ఎన్నికల సమయంలో ఘర్షణలు జరిగిన నేపథ్యంలో ఈ గ్రామాల్లో పర్యటించారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఈ గ్రామాల్లో స్పెషల్ బలగాలను మోహరించనున్నట్లు చెప్పారు. అన్ని పార్టీల శ్రేణులు ప్రశాంతంగా ఓటింగ్ జరిగేందుకు సహకరించాలని కోరారు. ఆయనతో పాటూ ఎస్సై జె.బలరామ్‌రెడ్డి ఉన్నారు.

బలహీనవర్గాల సంక్షేమమే జగనన్న ధ్యేయం

- ముదిరాజు కార్పొరేషన్ చైర్మన్ నారాయణ ముదిరాజు
- కంకణాలపల్లి గ్రామంలో ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనం



కంకణాలపల్లిలో సంఘీభావం తెలుపుతున్న నారాయణ ముదిరాజ్, సంఘ నాయకులు

సత్తెనపల్లి: బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ముదిరాజు కార్పొరేషన్ చైర్మన్ నారాయణ ముదిరాజ్ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి గ్రామంలో బుధవారం రాత్రి నిర్వహించిన ముదిరాజుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా నారాయణ ముదిరాజ్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేసిన నవరత్నాల పథకాల వల్ల బీసీ సామాజిక వర్గాల్లో జరిగిన ఆర్థిక పురోగతిని ప్రతి ఒక్కరికీ తెలియచేసి మళ్లీ వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రావాలని, తద్వారా బీసీలు లబ్ధి పొందాలన్నారు. బీసీలను బ్యాక్ బోన్‌గా జగన్ మోహన్ రెడ్డి గుర్తించి గౌరవించారన్నారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న మంత్రి అంబటి రాంబాబుని, నరసరావుపేట ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి, బీసీ సామాజిక వర్గానికి చెందిన డాక్టర్ పోలుబోయిన అనిల్ కుమార్ యాదవ్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి అఖండ మెజార్టీతో వైఎస్సార్ సీపీని గెలిపించాలన్నారు.సమావేశంలో ముదిరాజు సంఘ నాయకులు కంటు వెంకట్రామయ్య, కంటు సాంబయ్య, నక్క రమణయ్య, కంటు బ్రహ్మయ్య, పేరుబోయిన శ్రీను, కంటు సుబ్బారావు, ముదిరాజ్ సంఘ నాయకులు, బీసీ సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు

బల్లికురవ: బాలికను మాయమాటలతో తీసుకెళ్లి లైంగిక దాడి చేసిన ఘటనపై ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు బల్లికురవ పోలీసు స్టేషన్ ఏఎస్‌ఐ సి.బాలకృష్ణ గురువారం తెలిపారు. మండలంలోని కూకట్లపల్లి ఎస్సీ కాలనీకి చెందిన జొన్నలగడ్డ అవినాష్ కూలీలను ఆటోలో వ్యవసాయ పనులకు వివిధ గ్రామాలకు తీసుకువెళ్తుంటాడు. ఈ క్రమంలో అదే కాలనీకి చెందిన బాలిక ఆటోలో పనులకు వస్తోంది. ఆమెకు మాయమాటలు చెప్పి ఈనెల 15న బయటకు తీసుకెళ్లాడు. మూడు రోజులైనా గ్రామానికి రాకపోవటంతో బాలిక తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. గురువారం ఇంటికి వచ్చిన బాలిక తనపై అవినాష్ అత్యాచారం చేశాడని తల్లిదండ్రులకు వివరించటంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోక్సో చట్టం కింద కేసు నమోదుతో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఏఎస్‌ఐ వివరించారు.

ముస్లిం రిజర్వేషన్లపై కూటమి నోరు విప్పాలి

పర్చూరు (చినగంజాం): ముస్లిం రిజర్వేషన్లపై కూటమి నోరు విప్పాలని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు కార్యదర్శి గడ్డం మస్తాన్‌వలి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ముస్లిం రిజర్వేషన్లు రద్దు చేసి తీరుతామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారని, అమిత్‌షా మాటనే ఆయన పేర్కొన్నారన్నారు. ఏపీలోను అదే విధానం అని బీజేపీ నేతలు అంటున్నారని, చంద్రబాబు కూడా రిజర్వేషన్లు రద్దుకు అంగీకరించినట్లు ఆ పార్టీ నేతలు అంటున్నారని తెలిపారు. దీంతో ముస్లిం రిజర్వేషన్లపై రాష్ట్రంలో తీవ్రమైన చర్చ నడుస్తోందన్నారు. వైఎస్సార్ అధికారంలోకి రాగానే నాలుగు శాతం రిజర్వేషన్లు కల్పించారని, దాన్ని రద్దు చేస్తామని కిషన్‌రెడ్డి చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

పారదర్శక విధులే మా లక్ష్యం

నరసరావుపేట: నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, స్వేచ్ఛా వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నామని జిల్లా పోలీసు అధికారులు తెలియచేశారు. గురువారం ఓ దినపత్రికలో (సాక్షి కాదు) జిల్లా పోలీసుల వ్యవహారశైలిపై ప్రచురించిన వార్తలో ఎటువంటి వాస్తవం లేదన్నారు. జిల్లాలో ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోనైనా రాజకీయ అల్లర్లు, ఆయా వర్గాల మధ్య వివాదాలు జరిగి ప్రజల శాంతిభద్రతలకు విఘాతం కలిగినప్పుడు తక్షణమే స్పందించి బాధ్యులపై వెంటనే కేసులు నమోదు చేసి ముద్దాయిలను అరెస్ట్ చేసి చట్టపరంగా తగు చర్యలు తీసుకుంటున్నారని వివరించారు. ఆ నేరాలు బెయిలబుల్ నేరాలైతే సీఆర్‌పీసీ కింద 41 నోటీసులు ఇవ్వడం, నాన్ బెయిలబుల్ నేరాలు అయితే అరెస్టు చేసి రిమాండుకి పంపడం చేస్తున్నారన్నారు. దీనిలో ఏ పార్టీకి, ఏ వర్గంపై పోలీసులు పక్షపాతం చూపించడం లేదని వివరించారు. జిల్లాలో శాంతి భద్రతలకు సంబంధించి ఎటువంటి సమస్య తలెత్తినా పోలీసులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఏదైనా వార్త ప్రచురించే ముందు దానికి సంబంధించి పోలీసుల వివరణ కూడా తీసుకుంటే బాగుంటుందని అభిప్రాయపడ్డారు.

వైఎస్సార్ సీపీలోకి భారీ చేరికలు

- వేర్వేరు ప్రాంతాల్లో ప్రతిపక్షాలను వీడి....
- పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన నేతలు



పార్టీలో చేరిన వినుకొండ వాసులకు కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న బొల్లా బ్రహ్మనాయుడు



కొచ్చర్ల తండా వాసులకు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ పథకాలు, గ్రామాల్లో చేసిన అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలోకి చేరికలు పెరిగాయనీ, పార్టీలో చేరిన ప్రతిఒక్కరికీ సముచిత స్థానం, ప్రాధాన్యం ఉంటుందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వెల్లడించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని 27, 28 వార్డుల్లో భారీ సంఖ్యలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయా వార్డులకు చెందిన 100 కుటుంబాలు పార్టీలో చేరగా ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అదేవిధంగా స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఈపూరు మండలం కొచ్చర్ల తండాకు చెందిన 30 కుటుంబాలు టీడీపీని వీడి ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, జగనన్న హయాంలో పార్టీలకతీతంగా ప్రతిఒక్కరికీ మేలు జరిగిందని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థిగా అనిల్ కుమార్ యాదవ్‌ను, ఎమ్మెల్యేగా తనను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ, మండలస్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

చిలకలూరిపేటలో...

చిలకలూరిపేట: అధికార కాంక్షతో ముస్లిం మైనార్టీలను జగన్‌నుంచి దూరం చేయాలని చూస్తున్న కూటమి బూటకపు మాటల్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట ఎమ్మెల్యే అభ్యర్థి కావటి శివనాగ మనోహర్ నాయుడు చెప్పారు. పట్టణంలోని 11 వార్డుకు చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు తమ కుటుంబాలతో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి కావటి మనోహర్ నాయుడు సమక్షంలో గురువారం చేరారు. వారందరికీ పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కావటి మాట్లాడుతూ నవరత్న సంక్షేమ పథకాల ద్వారా ముస్లిం మైనార్టీలకు రూ. 23వేల కోట్లు, మైనార్టీ విద్య కోసం రూ.25.88 కోట్ల నిధులు అందించినట్లు వెల్లడించారు. 11వ వార్డులో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి చేరిన ముఖ్య నాయకుల్లో షేక్ రెహమాన్, షేక్ ఖాసిం, షేక్ సుభాని, షేక్ మనస్, షేక్ ఫర్కాన్‌తో పాటు పలు కుటుంబాలు చేరారు.

పేటలోనే స్థిర నివాసం

పట్టణంలోని గాంధీపేటలో ఉన్న బీపీ నాయుడు కాంప్లెక్స్‌లో వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్‌నాయుడు మాట్లాడుతూ తాను కార్యకర్త స్థాయి నుంచి ఎదిగిన వ్యక్తినని, తనకు కార్యకర్తల కష్టాలు తెలుసని చెప్పారు. చిలకలూరిపేటలోనే సొంత నివాసం ఏర్పాటు చేసుకొని నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని వెల్లడించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్దిరాల విశ్వనాథం, రిటైర్డ్ న్యాయమూర్తి కంచర్ల విజయకుమార్, పార్టీ క్రిస్టియన్ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాతులూరి కోటి, వేటపాలెం సుభాని, సయ్యద్ బషీర్ మేస్త్రి, తాళ్ల అంజిరెడ్డి, ఏఎంసీ సుభాని పాల్గొన్నారు.

నరసరావుపేటలో 15 కుటుంబాలు చేరిక

నరసరావుపేట: రొంపిచర్ల మండలం కొనకంచివారిపాలెం గ్రామ సర్పంచు పానుగోటి నాసరరావు, మాజీ సర్పంచ్ పానుగోటి వెంకటరావు, కొల్లి జగన్నాధరావు ఆధ్వర్యంలో 15 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరాయి. వీరికి గురువారం పార్టీ కార్యాలయంలో అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ కాలనీకి చెందిన వీరందరూ పార్టీలో చేరటం చాలా సంతోషంగా ఉందన్నారు. కాలనీకి రూ.50 లక్షలు ఎస్సీ గ్రాంటు నుంచి మంజూరు చేయించి రోడ్లు, డ్రెయిన్ నిర్మాణాలు చేశామన్నారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అమలయ్యాయన్నారు. వలంటీరు వ్యవస్థ ద్వారా ఇళ్లవద్దకే పథకాలు చేరాయన్నారు. దీనికి ఆకర్షితులైన వీరందరూ టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారన్నారు. పార్లమెంటు అభ్యర్థిగా డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్‌గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు.



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థి కాసు మహేష్‌రెడ్డి



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కావటి మనోహర్ నాయుడు



పార్టీలో చేరిన కొనకంచివారిపాలెం వాసులతో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి

పెట్లూరివారిపాలెంలో..

నరసరావుపేట: మండలంలోని పెట్లూరివారిపాలెం గ్రామానికి చెందిన ఐదుకుటుంబాల వ్యక్తులు గురువారం టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలతో ఆకర్షితులై పార్టీలో చేరినట్లు గోపిరెడ్డి వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీపీ మోరబోయిన శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు డాక్టర్ కొండపల్లి వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన పెట్లూరివారిపాలెం వాసులతో ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి

కొండూరులో నో జనసేన

అచ్చంపేట: మండలంలోని కొండూరులో జనసేన పార్టీ ఇకలేనట్లే కనిపిస్తోంది. ఆ పార్టీకి చెందిన అధ్యక్షులు గాదె కాటమరాజు, ఉపాధ్యక్షుడు కుంభా రామాంజనేయులు గురువారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. ఇప్పటికే చాలా గ్రామాలలో జనసేన ప్రభావం కనిపించడం లేదు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మేలు చేసిన వారికి ప్రజలు మద్దతిస్తారనడానికి ఇదే ఉదాహరణగా చెప్పొచ్చన్నారు. తాము అన్ని వర్గాలకు మేలు చేశాం కనుకనే పార్టీలకు అతీతంగా తమను ఆశీర్వదిస్తున్నారని, మళ్లీ జగన్ సీఎం కావాలని కోరుకుంటున్నారని చెప్పారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య, మాజీ సర్పంచ్ కంభాల వీరబాబు, అచ్చంపేట సర్పంచ్ జాని, మువ్వా సాంబశివరావు, రౌతు గోపి, దేశెట్టి అనంతరామయ్య, జనార్దన్ పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీలో చేరుతున్న కొండూరు జనసేన పార్టీ అధ్యక్ష, ఉపాధ్యక్షులతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

వైఎస్సార్‌సీపీలో టీడీపీ కుటుంబాలు చేరిక

పిడుగురాళ్ల : వైఎస్సార్ సీపీలోకి టీడీపీకి చెందిన పలు కుటుంబాల వారు చేరారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్, గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో దాచేపల్లి నగర పంచాయితీలోని 8, 10 వ వార్డులోని టీడీపీకి చెందిన పలు కుటుంబ సభ్యులు చేరారు. టీడీపీ నాయకుల వైఖరితో విసుగు చెంది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి, గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై టీడీపీని వీడి వైఎస్సార్ సీపీ పార్టీలోకి దాచేపల్లి మున్సిపల్ చైర్మన్ కొప్పుల సుబ్బయమ్మ భర్త సాంబయ్య ఆధ్వర్యంలో చేరికలు జరిగాయి. వైఎస్సార్‌సీపీలో చేరిన వారిలో గొట్టిముక్కల విజయరాజు, గొట్టిముక్కల సువర్ణరాజు, తాటిమళ్ల నాగేశ్వరరావు, తాటిమళ్ల రమేష్, దాస్ మైకేల్, కోడిరెక్క గోవర్దన్, కలుకూరు నాగేశ్వరరావు, కలుకూరి దేవి, పాముల సామేలులుతోపాటు పలువురు పార్టీలో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, నర్సరావుపేట ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దాచేపల్లి మున్సిపల్ చైర్మన్ కొప్పుల సుబ్బమ్మ భర్త సాంబయ్య, డాక్టర్ అశోక్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.